క్లుప్తంగా

19న మండల సమావేశం

చిన్నమండెం : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సుధామాధురి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు తప్పక హాజరుకావాల్సిందిగా కోరారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామ కస్పాకు చెందిన వింజమూర్ల రాజేశ్వరి, మల్లికార్జునల కనిష్ట పుత్రుడు భవానీ శంకర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తల్లిదండ్రులు సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతిలో 574 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

సర్టిఫికెట్‌ల ప్రదానం



మహిళలకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న సీపీఓ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గ్లోబల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ పార్థసారథి ఆధ్వర్యంలో ఏపీడీఎంసీ సీపీఓ సుదర్శన్‌రెడ్డి చేతులమీదుగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి అవసరమైన శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎ స్టార్ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రమణ్యం, మహిళలు పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

రామాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన ఈ పథకానికి 18 నుంచి 55 సంవత్సరాల లోపు వారు అందరూ అర్హులేనన్నారు. రూ.110లు చెల్లిస్తే ఐదు సంవత్సరాల వరకు చెల్లించాల్సిన పని లేదన్నారు. ఒక సంవత్సరం పాలసీ పొందిన తరువాత పాలసీదారుడు ప్రమాదవశాత్తు 50 శాతం వికలాంగుడిగా మారితే రూ.2.50లక్షలు, 100శాతం వికలాంగుడైతే రూ.5లక్షలు పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. పాలసీదారుడు సహజ మరణం అయితే రూ.1.30లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షలు ఇన్సూరెన్స్‌ను వర్తిస్తుందన్నారు. వివరాలకు మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, లేబర్ అధికారులను సంప్రదించాలని, అందరూ లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యత



పార్కులో వసతులను పరిశీలిస్తున్న కమిషనర్

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని ప్రజలకు కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లె రాహుల్‌రెడ్డిలు అన్నారు. సోమవారం వారు మున్సిపల్ అధికారులతో కలసి పట్టణంలోని 18 వార్డుతోపాటు పలు వార్డులలో పర్యటించారు. 18వ వార్డులోని మున్సిపల్ పార్కును పరిశీలించారు. పార్కులోని జిమ్ యంత్రాలు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టి ప్రజలకు, వాకర్లకు కనీస వసతులను కల్పించాలంటూ మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం కొత్తపేట రామాపురం, సుద్దల వాండ్లపల్లె రోడ్లులలో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలంటూ కోరారు. కార్యక్రమంలో వారి వెంట మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున అధికారులు పాల్గొన్నారు.

20న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 20న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సునలు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. అల్ట్రా డీలక్స్ బస్సులు ఏర్పాటు చేశామని రాను,పోను చార్జి రూ.805 చెల్లించాలన్నారు. టిక్కెట్లు కోసం 7392876638ను సంప్రదించాలని కోరారు.
మదనపల్లె-బి.కొత్తకోట రూటులో ఈనెల 30న లక్కీడిప్ డ్రా తీయనున్నట్లు డీఎం తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్టు వెనుకభాగంలో పేరు, మొబైల్ నంబర్, ఊరు పేరు రాసి బస్సులోని గిఫ్ట్ బాక్సులో వేయాలని కోరారు.

20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి



యువతకు 20 లక్షల ఉద్యోగాలు అన్నారు. అలాగే డిగ్రీ విద్యార్హత కల్గి ఉన్న యువతకు నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. 2014-19లో అధికారంలోకి వచ్చిన ఆ ఐదు సంవత్సరాలు నిరుద్యోగ భృతి హామీని నిలబెట్టుకోలేదు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తాయని చిన్నచిన్న ప్రైవేటు ఉద్యోగాలకు యువత గుడ్‌బై చెప్పి వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటినా ఇంతవరకు ప్రభుత్వం నుంచి జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరం.

– పల్లె గ్రీష్మంత్ రెడ్డి, అరవపల్లి, నందలూరు

భృతి కోసం ఎదురుచూస్తున్నాం



రాష్ట్రంలో లక్షలాది మంది నాలాంటి నిరుద్యోగులు చంద్రబాబునాయుడు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తాడా అని ఎదురు చూస్తున్నాం. నేను బీటెక్ పూర్తి చేసుకొని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నా. ప్రొఫెషనల్ కోర్సులు చేసిన వారు బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయాల్సివుంటుంది. పేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు పెద్ద నగరాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల చంద్రబాబునాయుడు తక్షణమే రాష్ట్రంలోని నిరుద్యోగులందరికి నెలకు రూ.3 వేలు చొప్పున ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి.

– నేతి నాగేష్, నిరుద్యోగి, రాజంపేట

- 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోవాలి
- లేదా భృతి చెల్లించాలంటూ డిమాండ్
- కూటమి అధికారంలోకి వచ్చి నెల రోజులైనా హామీపై రాని స్పష్టత

భృతినివ్వు.. బాబూ

రాయచోటి/రాజంపేట : చాలా దుకాణాల దగ్గర ఓ బోర్డు ఉంటుంది.. అరువు రేపు అని.. ఎప్పటికీ రేపే అది. కూటమి అధినేత ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఇస్తానన్న నిరుద్యోగ భృతి అలాంటిదేనన్న అనుమానాలను నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పడం కొత్త కాదు. ప్రతి ఎన్నికల ప్రచారంలో చెబుతూనే వస్తున్నారు. 1995లో అంటే ఇప్పటికి దాదాపు మూడు దశాబ్దాల కిందటే చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తా అని ప్రకటించారు. అప్పట్లో ఆయన ఇచ్చిన హామీ జస్ట్ నెలకు రూ.100. తరువాత రెండు సార్లు నిరుద్యోగ భృతి ప్రకటించారు కానీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రెండు, మూడు నెలలు కొంత మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఇప్పుడు ఇచ్చిన మేనిఫెస్టోలోనూ ఆయన నిరుద్యోగ భృతిని ప్రకటించారు. ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం లేదా మూడు వేల నిరుద్యోగ భృతి అన్నది చంద్రబాబునాయుడు చెప్పిన మాట. 2014 నుంచి 2019 మధ్యలో చంద్రబాబు కల్పించిన ఉద్యోగాలు ఎన్ని విధాల లెక్క పెట్టినా 40 వేలు దాటలేదన్నది విశ్లేషకుల అభిప్రాయం. మరి అలాంటిది రాబోయే ఐదేళ్లలో ఇంటికి ఒక ఉద్యోగం లేదా రెండు లక్షల ఉద్యోగాలు అంటే జనం మరోమారు నమ్మి పట్టం కట్టారు. నిరుద్యోగ యువకుల ఆశలపై ఉద్యోగాలు లేదా భృతి రూపంలో కార్యరూపం దాల్చుతారా లేక గత హామీల లాగా మిగిలిపోతుందా అన్నది వేచి చూడాల్సిందే.

రాయచోటిలో 77,731 గృహాలు

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గంలో 22 నుండి 35 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న నిరుద్యోగ యువకులు 35 వేల పైమాటే. ఎన్నికల వేళ చంద్రబాబునాయుడు చెప్పినట్లుగా ఇంటికి ఒక ఉద్యోగం ఇచ్చినా 77,731 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అలా కాకుండా నిరుద్యోగులకు



రూ.3 వేలు వంతున 35 వేల మంది నిరుద్యోగులకు భృతి కల్పిస్తే రూ.10.50 కోట్లను ప్రతి నెల ఒక రాయచోటి నియోజకవర్గానికి చెల్లించాల్సి ఉంటుంది.

రాజంపేటలో..

నియోజకవర్గ వ్యాప్తంగా 3,07,003 మంది జనాభా ఉన్నారు. ఇందులో 50వేలకుపైగా పైగా నిరుద్యోగ యువత ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. యువత జాబ్ క్యాలెండర్‌పై గంపెడు ఆశలు పెట్టుకుంది. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంతవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతున్నారు. అధికారంలో వచ్చి నెలదాటినా నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని నియోజకవర్గంలోని యువత డిమాండ్ చేస్తోంది.

నట్టేట ముంచినట్లే



14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసి ఎంతో అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు. ఎన్నికల్లో ఆయన చేసిన హామీలను నమ్మి యువత ఆయనకు పట్టం కట్టాం. 2014లో ఇదే హామీ ఇచ్చి మోసం చేసిన సరే తిరిగి మరోసారి ఆయన్ను ఎన్నికల్లో విశ్వసించి ఓట్లు వేశాం. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడినా సరే నిరుద్యోగ భృతి గురించి ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం చూస్తుంటే మా యువతను మరోసారి చంద్రబాబు నట్టేట ముంచినట్లే అనిపిస్తోంది. మా యువత అంతా మరోసారి ఆయన్ను నమ్మి ఓట్లు వేసి మోసపోయాం.

– రవికుమార్, టంగుటూరు, నందలూరు మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను ఇంటర్ పూర్తి చేశాను. పై చదువులు చదివే స్తోమతలేక చదువు ఆపేశాను. ఇప్పుడు వైరింగ్ పనికి, డ్రైవింగ్ పనికి వెళుతున్నాను. అయినా కనీసం కూలీ డబ్బులు రావడంలేదు. పనులు కూడా పెద్దగా లేవు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తాం అని, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని వాగ్దానం చేశారు. చెప్పిన విధంగా నాకు ఏదో ఒక ఉద్యోగం అయినా ఇవ్వాలి.. లేదంటే నిరుద్యోగ భృతి అయినా ఇచ్చి మాటను కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి.

– షేక్ అహమ్మద్ బాషా, రాయచోటి

నిరుద్యోగులు అల్లాడిపోతున్నారు



నేను డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నా. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఎన్డీయే ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం కానీ నిరుద్యోగ భృతి కానీ అమలు పరిచాలి. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అల్లాడిపోతున్నారు. వారి పక్షాన ప్రభుత్వం నిలబడాలి. స్థానికంగా పరిశ్రమలను నెలకొల్పేలా చేసి ఉద్యోగాలను అందించాలి. లేదా వారికి ఉద్యోగం పొందే వరకు యువతకు తప్పనిసరిగా నిరుద్యోగ భృతిని అందించాలి.

– బి.వెంకటేశ్వర్లు, గాలివీడు

భృతిని భేషరతుగా చెల్లించాలి



కూటమి పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోలో మొదటి హామీగా ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయాలి. 2014-19లో నిరుద్యోగులను వంచించిన విధంగా ఈ సారి చేస్తే నిరుద్యోగుల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. స్థానికంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి మీ ఉద్యోగం నా బాధ్యత అన్న మాటకు సీఎం చంద్రబాబు కట్టుబడి యువతకు ఉద్యోగాలు కల్పించాలి లేదా రూ. 3వేలు నిరుద్యోగ భృతి భేషరతుగా చెల్లించాలి.

– రాజశేఖర్, అనంతంపల్లి, పుల్లంపేట

నిరుద్యోగ భృతిని అమలు చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. ఉద్యోగాన్ని వెతుక్కోవడానికి ఖర్చులు ఉంటాయి. అందువల్ల చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులకు పైన అయినా ఇంత వరకు నిరుద్యోగ భృతి గురించి ఊసేలేక పోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

– చరణ్, నిరుద్యోగి, రాజంపేట

ఉపాధి కల్పించాలి



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నియోజకవర్గ కేంద్రాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలలో యువకులకు ఇచ్చిన ఉద్యోగ హామీ అమలు చేసి యువకులకు తమ జీవితాలపై నమ్మకం కల్గించాలి. ఉద్యోగాల కోసం నాలాంటి వేలాది యువకులు ఎదురు చూస్తున్నాం. మాకు ఉద్యోగుల అందించి ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలి.

– షేక్ వసీం, బీటెక్, నరసరాంపేట, రైల్వేకోడూరు

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

సిద్దవటం : 2024 – 25 సంవత్సరానికి గాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలకు మొక్కలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో మామిడి, జామ, సన్ననిమ్మ, సపోట, చీనీ, మునగ పంటలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారం సిద్దవటంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తుతో పాటుగా ఉపాధి హామీ జాబ్‌కార్డు జిరాక్స్ కాపీ, రేషన్ కార్డు, జాబ్ కార్డులో ఉన్న అందరి ఆధార్‌కార్డులు, పట్టాదారు పాసు పుస్తకం, 1బీ ఆర్‌ఓఆర్, అడంగళ్, ఫీల్డ్ మ్యాప్, సన్న, చిన్న కారు సర్టిఫికెట్, బ్యాంక్ పాస్ బుక్, పైవన్నీ జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు జతపరిచి ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఇవ్వాలని ఎంపీడీఓ తెలిపారు.

ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నిర్మాణ రంగం కార్మికులు

రాయచోటి అర్బన్ : ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవడం ద్వారా నిర్మాణ రంగం కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలిచంద్రలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు ఉచిత ఇసుకను వెంటనే అందుబాటులోకి తేవాలంటూ నిర్మాణ రంగ కార్మికులతో కలసి కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాజంపేటకు 50 కిలోమీటర్ల దూరంలోని సిద్దవటం నుంచి ఇసుక సరఫరాను నిలుపుదల చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు అవుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాజంపేట ప్రాంతీయులకు ఇసుక సరఫరా కావడం లేదన్నారు. ఇసుక సరఫరా ఆగిపోవడంతో కార్మికులకు తగిన పనులు లేక వారి కుటుంబాలు పస్తులతో అల్లాడుతున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రాజంపేట ప్రాంతీయులకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, కార్మికులు కేశవ, నరసింహులు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర రెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసులు, హుస్సేన్, రంగస్వామి, పవన్‌లు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు రమణలు మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేని పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. నందలూరులోని విభ ఇంటర్నేషనల్ స్కూల్, గాలివీడులోని అద్వైత గురుకుల పాఠశాలల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. పైగా నిర్మాణంలో ఉన్న గదులలోనే తరగతులను నిర్వహిస్తుండడం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటమే అన్నారు. వెంటనే సదరు పాఠశాలల యాజమాన్యంపై చీటింగ్ కేసులను నమోదు చేయాలంటూ డిమాండ్ చేశారు. సదరు పాఠశాలలపై ముందుగా ఫిర్యాదు చేసినప్పటికీ జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. నిబంధనలు పాటించని పాఠశాలల అనుమతులు రద్దుచేయాలంటూ కోరారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ జిల్లా ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలను చేపడతామంటూ హెచ్చరించారు. అనంతరం జేసీ ఫర్మాన్‌అహమ్మద్‌కు ఈమేరకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి చందు, సభ్యులు చెంగయ్య, నరేష్, నాగార్జున, మదన్, జయాత్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం

నందలూరు : మండలంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు పేర్కొన్నారు. క్లబ్‌లో సభ్యులుగా నమోదైన వారికి సోమవారం ఐడీ కార్డులు, అవార్డులను కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో జయభాస్కర్ రావు పంపిణీ చేశారు. స్థానిక ఎంయిడెడ్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యుడు మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు చేస్తున్న ప్రజా సేవలను గుర్తించి విశాఖపట్నం బ్రాంచ్ వారు అవార్డులను ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ ఇంత సమయాన్ని కేటాయించి తమ ఆరోగ్య పరిరక్షణ కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయడం వారి దినసరిలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ మన్నెం రామ్మోహన్, కుర్రా మణియాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, శ్యామబోయిన గురు ప్రసాద్, గంధం గంగాధర్, గుండు సురేష్‌లు పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలో భైరవ గుట్టపై వెలసిన కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, ఆభరణాలతో స్వామి వారిని అందంగా అలంకరించారు. అనంతరం భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తుల తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంను సామరస్యంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భాస్కర్

చిన్నమండెం : ఈ నెల 16, 17వ తేదీలలో జరగబోవు మొహర్రం ఉత్సవాలను సామరస్యంగా జరుపుకోవాలని పీర్ల ఉత్సవ నిర్వాహకులకు రాయచోటి రూరల్ ఇన్‌ఛార్జ్ సీఐ భాస్కర్ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక పీర్ల మకాన్ ఆవరణలో ఉత్సవ నిర్వాహకులతో ఎస్‌ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదన్నారు. ఇందుకు గాను తమ సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తును చర్యలను గావించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో చిన్నమండెం ఎస్‌ఐ రమేష్‌బాబు, మొహర్రం ఉత్సవాల ఆర్గనైజర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయాలలో పూజలు



పూజలందుకున్న భుజంగేశ్వరుడు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం, పట్టణంలోని భుజంగేశ్వర ఆలయాలలో స్వామి వార్లకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శివలింగాలకు ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరించారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, పక్కనే ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనగలూరు : గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున డయేరియాతోపాటు జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్యాధికారులకు తెలిపారు. అలాగే మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే పరిష్కరించాలన్నారు. అంతకుముందు ఉపాధి హామీ ఏపీఓ మురళీ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి పలువురు రైతులు దరఖాస్తులు చేసుకున్నారని, ఇంకా సమయం ఉన్నందున ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ హరిప్రసాద్ మాట్లాడుతూ మండలానికి 1290 పక్కా గృహాలు మంజూరు అయ్యాయని, అందులో 453 పూర్తి అయ్యాయని, మిగిన గృహాలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరిధర్ మాట్లాడుతూ పొందలూరు సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా 35 గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉన్నా సాంకేతిక కారణాలు వలన 12 గ్రామాలకే అందిస్తున్నామన్నారు. పెనగలూరు మారారెడ్డి సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా 25 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని తెలియజేశారు.

డిసెంబర్‌లోపు నిర్మాణ పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్రారెడ్డి

వీరబల్లె : 2022 – 23 ఆర్థిక సంవత్సంరలో మంజూరైన ప్రభుత్వ గృహాలను ఈ ఏడాది డిసెంబర్ లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 – 23 సంవత్సరానికి గాను మండలంలోని 1043 లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు కాగా వాటిలో 667 పక్కా గృహాలు మాత్రమే పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన 367 గృహాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. అందుకు కావాల్సిన మెటీరియల్, సిమెంట్‌కు నగదు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. పూర్తి చేయకుంటే ఆ ఇండ్లను రద్దు చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రతి లబ్ధిదారుడు గమనించి వెంటనే పూర్తికాని పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా మహిళల భద్రత

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌ఛార్జ్ మిర్యాల సురేఖ సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై, చివరికి నెలల పసికందులపై అఘాయిత్యాలు జరుగుతుండటం దారుణమన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు దిశా చట్టాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ చట్టం వల్ల పడే శిక్ష కఠినంగా ఉండటంతో ఎవరు తప్పు చేయాలన్న ఆలోచన చేసేవారు కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హోంమంత్రి వంగలపూడి అనిత దిశా చట్టం లేదని చెప్పారని, అందువల్లే ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలు, పసికందులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. జగన్ తీసుకొచ్చిన దిశా పేరుతో చట్టాన్ని అమలు చేయడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేకపోతే మరో పేరుతో అయినా తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడే చట్టాన్ని తీసుకువచ్చి మహిళలకు భద్రత కల్పించాలని తెలియజేశారు.

అన్నదానం

రాజంపేట టౌన్ : అన్నదానం గొప్ప పుణ్యకార్యమని అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. పట్టణంలోని నాగులమాను వీధిలో జరుగుతున్న పీర్ల పండుగ వేడుకలో సోమవారం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించి పేదలకు వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ఐకమత్యానికి ప్రతీక అయిన పీర్ల పండుగ అన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

పుల్లంపేటలో తేలికపాటి వర్షం

పుల్లంపేట : మండలంలో సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని భావనారుషి దేవస్థానం సమీపంలో రోడ్డుపై నీరు నిలబడి కాలువను తలపిస్తోంది. ఈ రోడ్డుగుండా వెళ్లడానికి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి నీరు నిలబడకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.